క్లుప్తంగా

రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి

చొప్పదండి: వేసవిలో మామిడి పూత, పిందెలు రాలకుండా రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని మండల హార్టికల్చర్ అధికారి రోహిత్ కోరారు. వాతావరణ మార్పుల నేపథ్యంలో ఉదయం, సాయంత్రం మామిడి చెట్లకు నీరు అందించాలని సూచించారు. సూచించిన మందుల పిచికారీతో కాయ పరిమాణం పెరగడంతోపాటు నాణ్యతతో ఉంటుందన్నారు.

పశువైద్య శిబిరం

రామడుగు: మండలంలోని దత్తోజీపల్లిలో గురువారం ప్రాంతీయ పశుసంవర్ధక శిక్షణా కేంద్రం కరీంనగర్, రామడుగు మండల పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో మెగా పశువైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో ట్రైనీ వైద్యాధికారులకు పశుసంతానోత్పత్తి, గర్భకోశ వ్యాధులపై సీనియర్ వైద్యుడు జీవీకె శర్మ అవగాహన కల్పించారు. ప్రాంతీయ పశుసంవర్ధక శిక్షణా కేంద్రం సహాయ సంచాలకులు ఎన్.లింగారెడ్డి, కోటేశ్వర్‌రావు, సాయిచైతన్య, దివ్య, రామడుగు మండల పశువైద్యాధికారి అనిల్‌కుమార్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్య మహిళా క్యాంపు



పరీక్షలు చేస్తున్న డాక్టర్

శంకరపట్నం: మండలంలోని కాచాపూర్ గ్రామంలో గురువారం ఆరోగ్య మహిళా క్యాంపు నిర్వహించారు. మహిళలకు వైద్యురాలు శ్రావణి వివిధ పరీక్షలు చేశారు. ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న 52 మంది మహిళలకు పరీక్షల అనంతరం మందులు అందజేశారు.

హామీల అమలులో విఫలం

వీణవంక: ఆరు గ్యారంటీల అమలులో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీఆర్‌ఎస్వీ నియోజకవర్గ నాయకుడు వొల్లాల శ్రీకాంత్ అన్నారు. మండల కేంద్రంలో గురువారం మాట్లాడారు, రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ అంకెల గారడీగా మారిందని, విద్యారంగానికి తక్కువ నిధులు కేటాయించడం సరికాదన్నారు. గురుకులాలను నిర్లక్ష్యం చేస్తూ విద్యార్థుల మరణాలకు ప్రభుత్వం కారణమవుతోందని, విద్యాశాఖ మంత్రిగా సీఎం తప్పుకోవాలన్నారు.

కంపోస్టు ఎరువు తయారీపై అవగాహన



కంపోస్టు, సీడ్ బాల్స్ తయారీని వివరిస్తున్న రిసోర్స్ పర్సన్లు

మానకొండూర్: కంపోస్టు ఎరువు, సీడ్‌బాల్స్ తయారీపై మానకొండూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల(బాలుర) విద్యార్థులకు జిల్లా రిసోర్స్ పర్సన్లు గురువారం అవగాహన కల్పించారు.కలెక్టర్ ఎంపిక చేసిన పాఠశాలలో కార్యక్రమం నిర్వహించడం జరుగుతోందని హెచ్‌ఎం శ్రీనివాస్ తెలిపారు. రిసోర్స్ పర్సన్లు మాడిశెట్టి గోపాల్, కెఎస్ అనంతాచార్యులు కంపోస్టు ఎరువుల తయారీ, ఉపయోగం, సీడ్ బాల్స్ తయారీ, ఉపయోగాలను వివరించి విద్యార్థులతో సీడ్‌బాల్స్ తయారు చేయించారు. కార్యక్రమంతో విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణపై అవగాహన ఏర్పడుతుందన్నారు.

పొలంబాట



మానకొండూర్: విద్యుత్ మోటార్లకు కెపాసిటర్లు బిగించుకోవాలని, విద్యుత్‌శాఖ ఏడీఈ శ్రీనివాస్‌గౌడ్ రైతులను కోరారు. గురువారం గట్టుదుద్దెనపల్లి గ్రామంలో చెంజర్ల సబ్‌స్టేషన్ ఏఈ లక్ష్మణామూర్తి ఆధ్వర్యంలో పొలంబాట నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఏడీఈ హాజరై మాట్లాడారు. కెపాసిటర్లను బిగించుకుంటే మోటార్లు కాలిపోకుండా ఉంటాయని, కరెంట్ ఆదా అవుతుందని, రైతులు సొంతగా విద్యుత్ మరమ్మతులు చేపట్టొద్దని సూచించారు. అక్రమంగా విద్యుత్ వినియోగించే వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. విద్యుత్ సమస్యలపై అధికారులు సిబ్బంది స్పందించకుంటే టోల్ ఫ్రీ నంబర్ 1912 రైతులు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చన్నారు.

వేలం వాయిదా

జమ్మికుంట: మున్సిపల్ పరిధిలోని పశువుల, తైబజార్ అండగి వేలం వాయిదా వేశామని మున్సిపల్ కమిషనర్ ఎండీ అయాజ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 25న ఉదయం 11గంటలకు వేలం నిర్వహించనున్నామని, ఆసక్తి కలిగినవారు కమిషర్, సంఘం జమ్మికుంట పేరుతో జాతీయ బ్యాంక్ ద్వారా రూ.రెండు లక్షల డీడీని ఈ నెల 24వ తేదడీ రోజు సాయంత్రం వరకు కార్యాలయంలో అందజేయాలని, రూ. ఇరవై లక్షల సాల్వెన్సీ, నోడ్యూ సర్టిఫికెట్ సమర్పించి వేలంలో పాల్గొనాలన్నారు.

ఘనంగా పోచమ్మ బోనాలు



బోనాలతో ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు

తిమ్మాపూర్: మండలంలోని రామకృష్ణకాలనీలో మల్లికార్జునస్వామి పట్నాలులో భాగంగా గురువారం ఉదయం యాదవ సంఘం ఆధ్వర్యంలో పోచమ్మబోనాలు నిర్వహించారు. గ్రామంలోని కులస్తులు ఇంటికో బోనంతో ఆలయానికి చేరుకొని నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించారు. డీజే, డప్పు చప్పుళ్ల మధ్య యువత, మహిళలు ఆటపాటలతో ఆడిపాపారు. ఆలయ ప్రాంగణం దైవ నామస్మరణలతో మార్మోగింది. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ పోలం అంజియాదవ్, సంఘం అధ్యక్షుడు ఆవుల ఓదేలు, రాజు యాదవ్, సభ్యులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రామాలయ పునర్నిర్మాణానికి శ్రీకారం

చొప్పదండి: పట్టణంలోని పురాతన రామాలయం శిథిలావస్థకు చేరుకోవడంతో భవ్య రామ మందిర నిర్మాణం కోసం ఆలయ అనువంశిక అర్చక కమిటీ ఆధ్వర్యంలో ఉగాదిన భూమి పూజ చేస్తామని అర్చక కమిటీ సభ్యులు తెలిపారు. మందిర నిర్మాణానికి పట్టణానికి చెందిన ఆధ్యాత్మిక చింతన కలిగిన పలువురితో తాత్కాలిక కమిటీ ఏర్పాటు చేయనున్నామని గురువారం భవిష్యత్ కార్యాచరణ సమావేశంలో ప్రకటించారు. కొందరు రాజకీయ విమర్శలకు పాల్పడుతున్నారని, రాముడు, భక్తులను విమర్శించడం సరికాదని, ఏటా ఉత్సవాలు నిర్వహిస్తున్నామని, ఆదాయానికి ప్రతి పైసాకు లెక్క ఉందన్నారు. శ్రీరామనవమి తర్వాత మిగులు నిధులు ప్రకటిస్తామ, ఇంకా చందాలు వసూలు చేయలేదని, ఆలయ నిర్వహణ అనాదిగా అర్చకుల చేతిలోనే ఉందన్నారు. సమావేశంలో సింహాచలం వంశీయులు జగన్ మోహన్ స్వామి, హరిక్రిష్ణ, ప్రభాకరాచార్యులు, మురళిమోహనాచార్యులు, నరేందర్ స్వామి, విశ్వ మోహన్, విద్యాసాగర్, శ్రీనివాస్, వినోద్, వెంకటేశ్వర్లు, అనంతస్వామి, హరిన్, ప్రణయ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సింహాచలం వంశీయులు

హామీలు ఏమయ్యాయని పాటతోనే ప్రశ్నిస్తా

• మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రసమయి

మానకొండూర్: హామీలు అమలు చేయాలని పాటతోనే ప్రశ్నిస్తానని మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ అన్నారు. మానకొండూర్‌లో బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు, మాజీ జడ్పీటీసీలతో కలిసి గురువారం విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. నియోజకవర్గంలో అభివృద్ధి పనులు చేయలేదన్న ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ఆరోపణలను ఖండించారు. ప్రాజెక్టులు, అరవై వేల ఎకరాలకు కాలువల ద్వారా సాగునీరు, విద్యుత్ సబ్‌స్టేషన్లు, గ్రామ పంచాయతీ, మహిళా సంఘం, కుల సంఘ భవనాలు, సీసీరోడ్లు, మరుగుదొడ్లు, రోడ్లు పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో నిర్మించినవేనని, కమీషన్ల కోసం గన్నేరువరం డబుల్ రోడ్డుపై డ్రామా ఆడుతున్నాడని, రెండేళ్లుగా రోడ్డు ఎందుకు వేస్తలేరో చెప్పాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే నిధులతో పనులు చేశావా అంటూ ప్రశ్నించారు. ఎమ్మెల్యే కవ్వంపల్లికి మంచి బుద్ధి ప్రసాదించాలని అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు ఆగయ్య, మాజీ జెడ్పీటీసీ తాళ్లపల్లి శేఖర్‌గౌడ్, ఆరు మండలాల జెడ్పీటీసీలు, అధ్యక్షులు, మాజీ సర్పంచులు, నాయకులు పాల్గొన్నారు.

జమిలి ఎన్నికలతో ఖర్చు తక్కువ

బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి



మాట్లాడుతున్న గంగాడి కృష్ణారెడ్డి

జమ్మికుంట: జమిలి ఎన్నికలతో ఖర్చు తక్కువ అనేక ప్రయోజనాలు ఉంటాయని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి అన్నారు. గురువారం బీజేపీ పట్టణ శాఖ ఆధ్వర్యంలో వన్ నేషన్, వన్ ఎలక్షన్‌పై వర్క్‌షాపు నిర్వహించారు. 1967లో లోక్‌సభ, అసెంబ్లీలకు ఒకేసారి ఎన్నికలు జరిగాయన్నారు. పదే పదే ఎన్నికలకు పోకుండా పరిపాలనపై దృష్టి సారించవచ్చని, జమిలి ఎన్నికలు తీసుకురావాల్సిన అవసరం ఉందని కేంద్రంలోని ప్రభుత్వం భావించిందన్నారు. మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవిద్ నేతృత్వంలో కమిటీ ఏర్పాటు చేయగా నివేదికను కేంద్ర కేబినెట్ ఆమోదించిందని, ఏక కాలంలో ఎన్నికలు నిర్వహించేందుకు అవసరమైన రాజ్యాంగ సవరణలు, చట్టపరమైన మార్పులను సూచించిందన్నారు. జమిలి ఎన్నికలపై ప్రజల్లో చర్చ జరగాలన్నారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు కొలకాని రాజు, జమిలి ఎన్నికల జమ్మికుంట కన్వీనర్ ఆకుల రాజేందర్, కో కన్వీనర్ జీడి మల్లేష్, నాయకులు శ్రీనివాస్, కోరే రవీందర్, రమాదేవి, పోలింగ్ బూత్ అధ్యక్షులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పన్నుల వసూలు వేగవంతం చేయాలి

చొప్పదండి: మున్సిపాలిటీ పరిధిలో వందశాతం పన్నులు వసూలు చేయడంపై అధికారులు, సిబ్బంది దృష్టి సారించాలని, పన్నుల వసూళ్లు వేగవంతం చేయాలని మున్సిపల్ ప్రత్యేకాధికారి శ్రీపాదరాజేశ్వర్ అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ నాగరాజు అధ్యక్షతన పన్నుల వసూలుపై సమీక్షా సమావేశం నిర్వహించి పన్నుల బకాయిలపై చర్చించారు. అధికారుల పురోగతి అడిగి తెలుసుకున్నారు. ఈ నెల 31లోగా వసూళ్లు పూర్తి చేయాలని సూచించారు. అవసరమైతే రెవెన్యూ రికవరీ చట్టం ఉపయోగించాలని సూచించారు. ఈ సమావేశంలో మేనేజర్ ప్రశాంత్ కుమార్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సబ్సిడీపై యంత్రాల పంపిణీ

హుజూరాబాద్: రైతులకు యాంత్రీకరణ పథకం కింద రాయితీపై యంత్రాలు పంపిణీ చేయనున్నామని, అర్హులైన రైతులు నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ఏడీఏ సునీత గురువారం ప్రకటనలో తెలిపారు. 2024–25 ఆర్థిక సంవత్సరం యాభై శాతం సబ్సిడీతో ఇచ్చేందుకు ప్రభుత్వ మార్గదర్శకాలు వచ్చాయని, అర్హులువెంటనే దరఖాస్తు పత్రంతో మండల వ్యవసాయ కార్యాలయం సంప్రదించాలని కోరారు.

శంకరపట్నం: యాభైశాతం సబ్సిడీపై మహిళా రైతులకు వ్యవసాయ పనిముట్లు అందించనున్నామని ఏవో వెంకటేశ్ తెలిపారు. మహిళా రైతులు పట్టా పాసుబుక్, ఆధార్‌కార్డ్ జిరాక్స్, పాస్‌పోర్టు సైజ్‌ఫొటోతో 22లోపు వ్యవసాయ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

సీసీరోడ్డు పనుల అడ్డగింతపై అధికారుల విచారణ



విచారణ చేస్తున్న తహసీల్దార్ భాస్కర్

శంకరపట్నం: మండలంలోని అంబాల్‌పూర్ గ్రామంలో గురువారం సీసీరోడ్డు పనుల అడ్డగింతపై తహసీల్దార్ భాస్కర్ విచారణ చేపట్టారు. రూ.పదిలక్షల ఈజీఎస్ నిధులతో అంబాల్‌పూర్‌లో మాజీ జెడ్పీటీసీ బత్తిని శ్రీనివాస్‌గౌడ్ సీసీరోడ్డు నిర్మాణం చేపట్టాడు. చివరిదశలో చంద్రయ్య అనే రైతు కుటుంబం పనులను అడ్డుకుంది. రెవెన్యూ అధికారులు సర్వే చేయగా చంద్రయ్య సాగు చేసిన వరిపొలంలో కొంత ప్రభుత్వ భూమి ఉందని తెలిసింది. తుది దశ పనులు చేపట్టేందుకు సిద్ధం కాగా పనులను అడ్డుకోవడంతో తహసీల్దార్ భాస్కర్, ఎస్సై రవి రైతు కుటుంబ సభ్యులతో మాట్లాడారు. రోడ్డు పనులు చేసేందుకు అభ్యంతరం చెప్పడంతో శుక్రవారం గ్రామసభ నిర్వహించాలని కార్యదర్శిని ఆదేశించారు. గ్రామస్తుల తీర్మానంతో పనులు చేస్తామని స్పష్టం చేశారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ

చిగురుమామిడి: మండలంలోని బొమ్మనపల్లిలో ఆరుగురు లబ్ధిదారులకు కాంగ్రెస్ నాయకులు సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ చేశారు. గురువారం గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పార్టీ గ్రామ అధ్యక్షుడు రమణయ్య, ప్రధానకార్యదర్శి రాజిరెడ్డి, నాయకులు మొగిలి, కనుకయ్య, కనుకవ్వ, సమ్మయ్య, ఆంజనేయులు, కిషోర్, మల్లికార్జున్‌రెడ్డి, ప్రశాంత్, సమ్మయ్య, లింగయ్య, కనుకయ్య, వీరేశం, రాజయ్య పాల్గొన్నారు.

విజయవంతం చేయండి

చొప్పదండి: కరీంనగర్‌లోని కొండా సత్యలక్ష్మి గార్డెన్‌లో 23న జరిగే బీఆర్‌ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశానికి పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరవుతారని చొప్పదండి నియోజకవర్గంలోని నాయకులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ కోరారు. పట్టణంలో గురువారం నిర్వహించిన నాయకుల సమావేశంలో మాట్లాడారు. సమావేశంలో రవీందర్‌రెడ్డి, తిరుపతిరావు, శ్రీనివాస్‌రెడ్డి, రవీందర్, రాజేశ్వర్‌రెడ్డి, వినయ్‌కుమార్, గంగారెడ్డి, రాజశేఖర్, సాంబయ్య, అజయ్‌కుమార్ పాల్గొన్నారు.

నిధుల విడుదలపై జాప్యం వద్దు

హుజూరాబాద్: రెండో విడుత దళితబంధు నిధులను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని జనతాదళ్ (సెక్యులర్)పార్టీ జేడీఎస్ రాష్ట్ర కార్యదర్శి వడ్లూరి వాసు అన్నారు. గురువారం పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. నిధుల విడుదలపై జాప్యం వహించొద్దన్నారు.

వాటర్ ట్యాంక్ బహూకరణ



జమ్మికుంట: మున్సిపల్ పరిధి కొత్తపల్లిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు తాగునీటి సౌకర్యం కోసం వాసవి క్లబ్ సౌజన్యంతో మద్ది రాజేశేఖర్ జ్ఞాపకార్థం కుమారులు రవికుమార్, శివప్రసాద్ రూ. పదివేలు విలువ గల వాటర్ ట్యాంక్, జైహనుమాన్ బ్రిక్స్ యజమాని మధు సిమెంట్ ట్యాంక్ గద్దె నిర్మాణానికి సహకరించారు.

విద్యార్థులకు స్పోర్ట్స్ టీషర్టులు



చిగురుమామిడి: మండలంలోని ఇందుర్తి జెడ్పీపాఠశాల విద్యార్థులకు దాదాపు రూ.పదివేల విలువ గల టీషర్టులను పూర్వ విద్యార్థి సీహెచ్ సందీప్‌రెడ్డి గురువారం సొంతంగా పంపిణీ చేశారు. సందీప్‌రెడ్డి కోహెడ జెడ్పీపాఠశాలలో 2002–03 విద్యా సంవత్సరంలో ఎస్సెస్సీ పూర్తి చేశాడు. ప్రస్తుతం అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. కార్యక్రమలో హెచ్‌ఎం జయప్రద, టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

కాలువ ధ్వంసంపై ఫిర్యాదు

శంకరపట్నం: మండలంలోని మొలంగూర్ గ్రామంలో సాగనీటి ఉపకాలువ ధ్వంసంపై ఎస్సారెస్పీ ఈఈకి మొలంగూర్ గ్రామానికి చెందిన మోరె గణేశ్ ఫిర్యాదు చేశారు. ఎల్‌ఎండీ నుంచి వచ్చే కాలువ నీరు పంటలకు చేరకుండా 3 ఎల్ ఉప కాలువను రియల్టర్ ధ్వంసం చేశాడని, కాలువకు మరమ్మతు చేయాలని ఫిర్యాదులో కోరారు.

చికిత్స పొందుతూ మృతి

మానకొండూర్: మండలంలో శంషాబాద్ వద్ద నేషనల్ హైవేపై తిమ్మాపూర్ మండలం పోరండ్ల గ్రామానికి చెందిన తాపీమేస్త్రి కిన్నెర మల్లయ్య (56)రోడ్డు ప్రమాదంలో గాయాలపాలు కాగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. బుధవారం రాత్రి మల్లయ్య శంకరపట్నం మండలం కొత్తగట్టులో పనిచేసి ఇంటికి బైక్‌పై తిరిగి వస్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో తీవ్రగాయాలపాలయ్యాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ లక్ష్మీనారాయణ తెలిపారు.

సోషల్‌మీడియాలో వచ్చేవి నమ్మొద్దు

శంకరపట్నం: సోషల్ మీడియాలో వచ్చేవన్నీ నిజం కాదని కేశవపట్నం పోలీసులు పోలీసుశాఖ ముద్రించిన బ్రోచర్లతో ప్రచారం చేస్తున్నారు. ఈజీ మనీ, టైంపాస్ కోసం బెట్టింగ్‌ల జోలికి వెళ్లొద్దనని ఎస్సై రవి ప్రజలకు అవగాహన చేస్తున్నారు. ఆన్‌లైన్ గేమ్స్ పేరుతో మొదట ఆశ చూపించి బానిసల్ని చేస్తారని, ఆన్‌లైన్ గేమ్స్ కుటుంబాలను రోడ్డుపడేస్తాయని అన్నారు.

'పది' పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

సాక్షినెట్‌వర్క్: చొప్పదండి, హుజూరాబాద్, మానకొండూర్, హుస్నాబాద్ నియోజకవర్గాల్లో ఈ నెల 21 నుంచి ఏప్రిల్ 2వ తేదీ వరకు జరిగే పది పరీక్షలకు విద్యాశాఖ అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. పరీక్ష కేంద్రాలకు విద్యార్థులు సకాలంలో హజరు కావాలని ఆయా మండలాల ఎంఈవోలు సూచించారు. పరీక్ష కేంద్రాల వద్ద 144సెక్షన్ అమలులో ఉంటుందని, విద్యార్థుల భవిష్యత్‌ను దృష్ట్యా అందరూ సహకరించాలని కోరారు. వేసవి నేపథ్యలో కేంద్రాలకు ముందే రావాలని సూచించారు.

క్షీరాభిషేకం

చొప్పదండి: ఎస్సీ వర్గీకరణ బిల్లు అసెంబ్లీలో ఆమోదం పొందినందుకు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొత్తూరి మహేశ్ ఆధ్వర్యంలో గురువారం పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం నిర్వహించారు.

రామడుగు: కాంగ్రెస్ పార్టీ రామడుగు అధ్యక్షుడు జవ్వాజీ హరీశ్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రు దామోదరా రాజనరసింహ, పొన్నం ప్రభాకర్, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు.

ఇల్లందకుంట: మండలంలోని సిరిసేడులో సీఎం రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్ చిత్రపటాలకు కాంగ్రెస్ సీనియర్ నాయకుడు రామకృష్ణ ఆధ్వర్యంలో క్షీరాభిషేకం చేశారు. భారత్‌జోడో యాత్రలో రాహుల్‌గాంధీ ఇచ్చిన మాట ప్రకారం సీఎం రేవంత్‌రెడ్డి సమగ్ర కులగణన చేసి బీసీలకు 42శాతం రిజర్వేషన్, ఎస్సీల వర్గీకరణ బిల్లును అసెంబ్లీలో ఏకగ్రీవంగా ఆమోదించడం హర్షణీయమన్నారు.



మానకొండూర్: మండలంలోని అన్నారం– ఈదులగట్టెపల్లి గ్రామాల మధ్య విద్యుత్ తీగలు ప్రమాదకరంగా ఉన్నాయి. అన్నారం గ్రామ శివారులో రోడ్డు పక్కన విద్యుత్ తీగలను చెట్ల కొమ్మలు తాకుతున్నాయి. చెట్ల కొమ్మలు విద్యుత్ తీగలు కమ్మేస్తుండటంతో ప్రమాదాలు చోటు చేసుకునే అవకాశం ఉందని ప్రయాణికులు, వాహనదారులు, రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి కరెంట్ తీగలకు తగులుతున్న చెట్ల కొమ్మలను తొలగించాలని కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
సత్యనారాయణ, ఏఈ మానకొండూర్ విద్యుత్ సబ్‌స్టేషన్ సెల్ నంబర్: 83099 21090

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది.

మా ఫోన్ నంబర్లు: 9393557752, 9848408781, 8790144227

మందకృష్ణ పోరాట ఫలితమే ఎస్సీ వర్గీకరణ



క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

రామడుగు: ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ సుదీర్ఘకాల పోరాటంతోనే అసెంబ్లీలో ఎస్సీ వర్గీకరణ బిల్లు ఏకగ్రీవంగా ఆమోదం పొందిందని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు బెజ్జంకి అనిల్ మాదిగ అన్నారు. రామడుగులో గురువారం అంబేడ్కర్ విగ్రహం ఎదుట మందకృష్ణ చిత్రపటానికి నాయకులతో కలిసి క్షీరాభిషేకం చేశారు. మాదిగ అమరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో నాయకులు రాజన్న, శంకర , శేఖర్,లచ్చయ్య, హన్మయ్య, అంజయ్య, బక్కయ్య, కనకయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

యువత భాగస్వామ్యంతోనే వికసిత్ భారత్

కరీంనగర్‌సిటీ: వికసిత్ భారత్‌లో యువత భాగస్వామ్యం ఎంతో అవసరమని ఎస్ఆర్ఆర్ కాలేజీ ప్రిన్సిపాల్ రామకృష్ణ అన్నారు. కాలేజీలో గురువారం భూపాలపల్లి, కరీంనగర్ జిల్లాల వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. నేషనల్ యూత్ జిల్లా కోఆర్డినేటర్ వెంకటరాంబాబు మాట్లాడుతూ వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్‌లో ఈ నోడల్ కళాశాల విద్యార్థులకు లభించిన అపురూపమ అవకాశం అన్నారు. శాతవాహన యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ మనోహర్ విద్యార్థుల్లో సృజనాత్మక శక్తి ఉంటేనే విజయం సాధించవచ్చని సందేశమిచ్చారు. జ్యూరీమెంబర్ కళాశాల విశ్రాంత ప్రధానాచార్యులు కె.మురళి, వికసిత్ భారత్ నోడల్ జిల్లా అధికారి ఎలిజబెత్ రాణి, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ నితిన్ పాఠక్, టి.రాజయ్య, స్టాఫ్ క్లబ్ సెక్రటరీ శ్రీనివాసరెడ్డి ,ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు కాంపల్లి అర్జున్, రాజేశం, పడాల తిరుపతి, రాపర్తి శ్రీనివాస్, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు విద్యార్థులు పాల్గొన్నారు .

ఎస్సారార్ కాలేజీలో చేరండి



గంగాధర: నాణ్యమైన డిగ్రీ విద్య కోసం కరీంనగర్‌లోని ఎస్సారార్(శ్రీరాజరాజేశ్వర) ప్రభుత్వ అటానమస్ కళాశాలలో చేరాలని అడ్మిషన్ బృందం బాధ్యులు, అదనపు పరీక్షల నియంత్రణ అధికారి మల్లారెడ్డి మండలంలోని ప్రభుత్వ, ప్రయివేటు జూనియర్ కళాశాలల వద్ద గురువారం ప్రచారం నిర్వహించారు. ఏళ్ల చరిత్ర కలిగిన కళాశాలకు న్యాక్ ఏ గ్రేడ్ తో పాటు అటానమస్ హోదా లభించిందన్నారు. కళాశాలలో 36 డిగ్రీ కోర్సులతో పాటు 11 పీజీ కోర్సులున్నాయన్నారు. ప్రచారంలో అడ్మిషన్ల బృందం సభ్యులు రాజేందర్, పూర్ణచందర్, నిఖిలేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మోడల్ స్కూల్‌లో పిచ్చుకల దినోత్సవం

చిగురుమామిడి: మండలంలోని చిన్నముల్కనూర్ మోడల్ స్కూల్‌లో ప్రపంచ పిచ్చుకల దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు డ్రాయింగ్, పోస్టర్ మేకింగ్, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ప్రకృతిలో ప్రతి జీవి ఆవశ్యకతను వివరిస్తూ ఒకజీవి మరొక జీవిపై ఆధారపడాల్సి ఉంటుందని విద్యార్థులు డ్రాయింగ్‌లో వివరించారు. రకరకాల పక్షుల గూళ్లను సేకరించడంతో పాటు పిచ్చుకలకు, అవసరమైన వాటర్‌ఫీడర్లను తయారు చేసి ప్రదర్శించారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని ఆలోచింపజేశాయి. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ప్రిన్సిపాల్ బహుమతులు ప్రదానం చేశారు.